# అమోల్ కాలియా

అది 18,000 అడుగుల ఎత్తున ఉన్న కార్గిల్–యాల్డోర్ యుద్ధరంగం. ఆ ప్రదేశాన్ని 'పొజిషన్ 5302' అంటారు.

మరణపవనాలుగా చెప్పదగిన మంచు గాలులు అక్కడ వీస్తుంటాయి. అవి శరీరాలను గడ్డకట్టిస్తాయి. రక్షణగా ఎన్ని ఉన్ని దుస్తులు ధరించినా, ఎన్నెన్ని జాగ్రత్తలు తీసుకున్నా చలి కాటు తప్పదు.

శత్రువులు అక్కడ తిష్టవేసారు.

అసూయ, ద్వేషాలతో రగిలిపోతున్నారు.

భారతదేశం శాంతి సౌఖ్యాలతో ఉండడం వారు భరించలేకపోతున్నారు. చీకటిమాటున, మంచు దిన్నెల చాటున చోరుల్లా మన కీలక ప్రాంతాల్లో ప్రవేశించి, స్థావరాలు నిర్మించుకున్నారు. మన సైనికవాహనాల్ని గురిగా చేసుకుని తీరని నష్టం కలిగిస్తున్నారు.

యుద్ధరంగం నుంచి వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రతికూల పరిస్థితుల్లో జరుగుతున్న యుద్ధం అది.

నష్టాలు అంచనాలకు మించి ఉంటున్నాయి.

ఎప్పటికప్పుడు కొత్త దళాలను సిద్ధం చేసి, యుద్ధరంగంలోకి పంపుతున్నారు. వీరస్వర్గమలంకరించిన సైనికుల మృతదేహాలను తీసుకురావడం కూడా ప్రమాదభరితంగా ఉంది. అలా కాల్పులు సాగిస్తున్నారు శత్రువులు.

**కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

* * *

"కెప్టెన్ కాలియా!"

"జీ సాబ్" – కమేండర్‌కి శాల్యూట్ కొట్టి, ఎటెన్షన్‌లో నిలబడ్డాడు కెప్టెన్ అమోల్ కాలియా.

"నువ్వు పర్వతయుద్ధంలో స్పెషలిస్ట్‌వి కదూ?"

"అవును సార్..."

"నీ టీమ్ అంతా రెడీగా ఉన్నారు కదా?"

"ఉన్నాం సర్..."

"పాయింట్ 5302 ని మీ టీమ్ పట్టుకోవాలి..."



"అలాగే సర్..."

"మిమ్మల్ని హెలీకాప్టర్స్‌లో నేరుగా యుద్ధ రంగంలో దింపుతారు..."

"అలాగే సర్..."

"కాలియా..."

"సర్..."


"ఇది నీకు తొలి యుద్ధానుభవం కదూ?"

"అవును సర్..."

"ఏమన్నా భయపడుతున్నావా?"

"అలాంటిదేమీ లేదు సర్..." దృఢ స్వరంతో చెప్పాడు.

"వెరీగుడ్! గంటలో హెలీకాప్టర్లు రెడీగా



ఉంటాయి. మీ టీమ్‌లో అందర్నీ సిద్ధంగా ఉండమను".

"ఓ.కే. సర్. జైహింద్..."

"జైహింద్..."

శాల్యూట్ చేసి తన గుడారం వైపు వెళ్లాడు అమోల్ కాలియా.

తన టీమ్ సిపాయిలందర్నీ సమావేశపరిచాడు.

"మనం మరొక గంటలో యుద్ధరంగానికి వెళ్లబోతున్నాం. అందరూ సిద్ధమేనా?"

"సిద్ధమే సార్"

"మీ వస్తువులేవీ మర్చిపోకండి... సుబేదార్ విజిల్ వెయ్యగానే రండి"

"అలాగే సాబ్..."

"ఇక వెళ్లండి" - వాళ్లని పంపి, తన గుడారంలోకి వెళ్ళి అన్నీ ప్యాక్ చేసుకున్నాడు అమోల్ కాలియా.

వాటర్ బాటిల్‌లోంచి మంచినీళ్లు తాగాడు.

కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నాడు.

జేబులోంచి తల్లిరాసిన ఉత్తరం తీసి చదువుకున్నాడు. అందులోనే తండ్రి కూడా రాసాడు. ఇద్దరికీ తన క్షేమం గురించే ఆందోళన. తమ్ముడు అమన్ కాలియా ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లైట్ లెఫ్టినెంట్. ముందు తన పెళ్లి చేసి, తరువాత తమ్ముడి పెళ్లి చేయాలని అమ్మానాన్నల ఆకాంక్ష.

అతని పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

రేపు పెళ్లయి, పిల్లలకి తండ్రి అయితే తను

కూడా ఇలాగే ఆందోళన పడతాడా? తప్పదేమో!

అతనికి తన స్వస్థలం నంగల్ పట్టణం గుర్తుకొచ్చింది.

భాక్రాబియాస్ మేనేజ్‌మెంట్ బోర్డు కాలనీలోని ఎన్-19 తమ ఇల్లు. తమది ఒక మధ్య తరగతి కుటుంబం. తండ్రి ఎస్.పి. శర్మ టీచరు. అందరితో మంచిగా మసలేవాడు. తల్లి ఉషాశర్మ అంటే ఇరుగుపొరుగులందరికీ ఇష్టమే.

నంగల్ పట్టణంలో ఎన్.డి.యే.కి సెలక్టయిన తొలివ్యక్తి తనే!

ట్రయినింగ్ పూర్తయి, 'పాస్ అవుట్' జరుగుతున్నప్పుడు, ఆ పెరేడ్ చూడడానికి తల్లిదండ్రులిద్దరూ ప్రత్యేకంగా వచ్చారు. వారు తన డ్రస్ సరిచేస్తున్నప్పుడు ఒక మిత్రుడు ఫొటో క్లిక్‌మనిపించాడు. డైరీలోంచి ఫొటో బయటకు తీసి చూసుకున్నాడు.

తండ్రి మొహంలో మందహాసం. తల్లి మోములో దరహాసం.

వారిద్దరి మధ్య యూనిఫారమ్‌లో నవ్వుతూ తను!

ఆఫీసరు అయ్యాక అదే తన తొలిఫొటో.

ఆరోజు తనలాగే తన సహచరుల్లో అందరికీ ఆత్మీయులతో గడిపే అరుదైన అవకాశం లభించింది.

కెమెరాలు 'క్లిక్'మంటూ ఆ మధురక్షణాలను చిత్రాల్లో బంధించాయి. జ్ఞాపకాల్లోంచి మెల్లగా తేరుకుని, అమోల్ కాలియా ఇంటికి ఉత్తరం రాయడానికి ఉపక్రమించాడు.

* * *

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు (16 సం॥లు) వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధ వీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడుతున్న ఈ ప్రత్యేక కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

ఆ రోజు 1999 - జూన్ 8వ తేది.

హెలికాప్టర్లు గుండెల్లో సైనికుల్ని దాచుకుని వేగంగా కార్గిల్ - యాల్డోర్ యుద్ధరంగంలో 'పొజిషన్ 5302' వైపు దూసుకుపోతున్నాయి.


వాటిల్లో ఉన్న నలభైమంది యుద్ధవీరులకు అమోల్ కాలియా నాయకుడు. అందరూ యుద్ధ దుస్తుల్లో ఉన్నారు.

అందరి మనస్సుల్లో ఒక్కటే ఆలోచన...

ఎంత త్వరగా యుద్ధరంగానికి వెళ్లి శత్రువులను తరిమికొడదామా అని.

18,000 అడుగుల ఎత్తున ఉన్న ఆ యుద్ధ క్షేత్రం వైపు విమానాలు నడపడం కూడా సాహసోపేతమే.

అయితే వైమానిక దళ పైలట్లు ఎంతో అనుభవజ్ఞులు. సాహసానికి పెట్టింది పేరు. ఎంతో చాకచక్యంగా హెలికాప్టర్లను గమ్యంవైపు నడపడంలో సిద్ధహస్తులు. అమోల్ కాలియా పైలట్ దగ్గరే నిలబడి అతని నైపుణ్యాన్ని గమనిస్తు



తల్లిదండ్రులతో కెప్టెన్ అమోల్ కాలియా

న్నాడు. అంతకు మునుపు అమోల్ చాలాసార్లు హెలికాప్టర్లో ప్రయాణించాడు. 'పైలట్ కాబిన్' లోంచి కదిలిపోతున్న పరిసరాల్ని చూడడం అతనికెంతో ఇష్టం. పైలట్లు కూడా అతనికి సాదరంగా స్వాగతం పలుకుతారు. తమ సహచరుడు అమన్ కాలియాకి అన్నగారనే ఆప్యాయత చూపుతారు.

చూస్తుండగానే గమ్యం వచ్చేసింది.

పైలట్ నేర్పుగా హెలీపాడ్ మీదకు హెలికాప్టర్ని దింపాడు.

ఒకదాని వెంట ఒకటిగా హెలికాప్టర్లు దిగాయి.

సైనికులు చకచక బయటకు వచ్చి, పైలెట్లకు వీడ్కోలు చెప్పారు. పైలట్లు శాల్యూట్ చేస్తూ మళ్లీ తమ 'బేస్' వైపు వెళ్లిపోయారు.

* * *

జూన్ 9వ తేదీ.

ఎప్పటిలాగానే ఉషాశర్మ భర్తతో బాటు భోజనం చేసి నిద్రకు ఉపక్రమించింది. ఎస్.పి. శర్మ పరీక్ష పేపర్లు దిద్దుతూ కూర్చున్నాడు. మర్నాడు వాటిని విద్యార్థులకివ్వాలి. ఉపాధ్యాయుడిగా అతనికి మంచి పేరుంది.

టైమ్ చూసాడు.

పదకొండు దాటింది. బద్ధకంగా ఆవలించి, ఒకమాటు వళ్లు విరుచుకుని వెళ్లి భార్య ప్రక్కన పడుకున్నాడు. ఆమె నిద్రలోనే కలవరిస్తూ అతని మీద చెయ్యివేసింది. శర్మ నవ్వుకుంటూ బరువెక్కుతున్న రెప్పలు మూసుకున్నాడు.

అలా ఎంతసేపు పడుకున్నాడో తెలియదు.

హఠాత్తుగా ఉష ఏడుస్తూ, కంగారుగా తనని కుదపడంతో చటుక్కున లేచి కూర్చున్నాడు. "ఏమైంది ఉషా? ఏమైంది?" ఆదుర్దాగా అడి

గాడు.

ఆమె రోదిస్తూ "అమోల్ మీద పీడకల వచ్చిందండీ... అబ్బాయి ఎక్కడ, ఎలా ఉన్నాడో..." అంది.

"భయపడకు. భగవంతుడు మన బిడ్డల్ని చల్లగా చూస్తాడు" ఆమెను చేతుల్లోకి తీసుకుని వెన్ను మీద తట్టాడు శర్మ.

"అమన్ గురించి కూడా ఏమీ తెలియదు. ఒకసారి ఫోన్ చేయకపోయారా?"

"రేపు చేస్తాను. ప్రశాంతంగా పడుకో" అన్నాడు ఆమెకు ధైర్యం చెబుతూ.

పడుకుందన్నమాటేగానీ ఆమెకు ఇంకా కళ్లముందు పీడకల దృశ్యాలే మెదులుతున్నాయి.

* * *

కాలియా తన సహచరులతో 5302 పొజిషన్ వైపు చకచకా సాగిపోతున్నాడు. అంతలో శత్రువులు చుట్టుముట్టారు. వాళ్లు ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపలే మృత్యుదేవత కోరల్లా తూటాలు వడివడిగా వాళ్లమీదకు రాసాగాయి. చప్పున పొజిషన్స్ తీసుకుని ఎదురు కాల్పులు ప్రారంభించారు. అమోల్ కాలియా బృందం ఆత్మరక్షణలో చిక్కుకుపోవడంతో శత్రువుల తూటాలకు ఒక్కొక్క సహచరుడూ వీరమరణం చెందసాగాడు.

అమోల్ కాలియా దగ్గరున్న రెండు తుపాకులూ ఖాళీ అయ్యాయి.

శత్రువులు అవిరామంగా కాల్పులు సాగిస్తూనే ఉన్నారు.

కన్నుమూసిన సహచరుల వద్ద ఉన్న తుపాకులు తీసుకుని ఎదురుకాల్పులు కొనసాగిస్తున్నాడు అమోల్ కాలియా.

శత్రువులు దాదాపు ఇరవైమంది దాకా కుప్పకూలారు.

అయినా కాల్పులు ఆగలేదు.

## సుప్రభాతం



ఇల్లాలు ఇందుమతి నిద్ర లేవగానే మెళ్ళో
మంగళసూత్రాలు కళ్ళకు అద్దుకుని
గోడకి వున్న వెంకటేశ్వరస్వామి పటానికి
దండం పెడుతూ ఇలా ప్రార్థించింది -
"ఏడుకొండలవాడా! ఇవాళ పాల ప్యాకెట్లు
ఇచ్చేవాడు రావాలి! పనిమనిషి మానకుండా
రావాలి! మంచినీళ్ళు రావాలి! కరెంటు
పోకుండా... లిఫ్టు ఆగిపోకుండా వుండాలి!
ఆయన ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి క్షేమంగా వెళ్ళి
క్షేమంగా తిరిగి రావాలి!
మ్యాట్నీకి కొత్త సిన్మా టికెట్లు దొరకాలి!!"
అంటూ చీర సర్దుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

అంటే వాళ్లు ఇంకా చాలామంది ఉన్నారన్న మాట.

కాలియా తన సహచరులకేసి చూసాడు. దాదాపు పదకొండు మంది ప్రక్కకు ఒరిగి పోయి ఉన్నారు. వాళ్ల తుపాకులు నిశ్శబ్దంగా ఉన్నాయి.

తుపాకి ఖాళీ అయినప్పుడల్లా కాలియా మరణించిన సహచరుల దగ్గర ఉన్న తుపాకులు తీసుకుని యుద్ధం కొనసాగించాడు.

గంటల తరబడి యుద్ధం అలా కొనసాగుతూనే ఉంది.

* * *

ఉదయం ఎస్.పి. శర్మ చాయ్ తాగుతూ అలవాటుగా వార్తాపత్రిక చదువుతున్నాడు. ఉన్నట్లుండి "ఉషా" అని పెద్దగా కేకవేసాడు. చేతిలోంచి టీ కప్పు జారిపడిపోయింది.

ఉష పరుగున వచ్చింది "ఏమిటండీ... ఏమైంది?" అంది ఆదుర్దాగా.

నోటమాట రాక, దుఃఖంతో ఆమె చేతికి పేపరు ఇచ్చాడు శర్మ.

ఆమె గబగబా చదివింది.

"కార్గిల్‌లో కొన్ని పర్వతప్రాంతాల స్వాధీనానికి జరిగిన హోరాహోరీ పోరాటంలో కెప్టెన్ అమోల్ కాలియా వీరమరణం చెందారు. ఈ పోరాటంలో భారతసైన్యానికి కీలకవిజయం లభించింది" – ఆమె కుప్పకూలిపోయింది.

క్షణాల్లో ఆ వార్త కాలనీలో అందరికీ తెలిసి పోయింది.

స్నేహితులు, బంధువులు, స్థానికులతో ఆ ఇల్లు కిటకిటలాడిపోయింది. అందరినోటా అమోల్ కాలియా గురించిన ప్రశంసలే. పాతికేళ్ల వయస్సులోనే పరమవీరుడిగా కాలియా శాశ్వత కీర్తి సంపాదించాడు.

నంగల్ పట్టణంలో ఏకైక ఎన్.డి.ఎ. గ్రాడ్యుయేట్‌గా కాలియా గురించి గర్వంగా చెప్పుకునే మిత్రులు ఇప్పుడు విషణ్ణవదనాలతో, అతని స్మృతులతో సతమతమవుతున్నారు. అంతలో కాలియా రాసిన చివరి ఉత్తరం వచ్చింది.

"ప్రియమైన అమ్మానాన్నలకు –

నమస్కారాలు. నా గురించి బెంగపడకండి. నా కర్తవ్యం పూర్తికాగానే ఢిల్లీకి తిరిగివస్తాను. మీకు అంత తొందరగా ఉంటే అప్పుడు నాకు పెళ్లి సంబంధం ఖాయం చేయండి..."

ఉష ఆ ఉత్తరంలో మొహం దాచుకుని వలవల ఏడ్చింది.

"మా అబ్బాయి ఇంత సాహసం చేస్తాడని నేను కలలో కూడా అనుకోలేదు. నా దృష్టిలో అతనింకా పసిపిల్లాడిలాగానే కనిపిస్తున్నాడు... అతనికి మనస్ఫూర్తిగా జోహార్లర్పిస్తున్నాను" అన్నాడు గద్గద స్వరంతో శర్మ.

అమోల్ కాలియా నంగల్ పట్టణంలోని యువతకి ఎంతో ఆదర్శవీరుడైనాడు. ఇంజనీరింగ్, మెడిసిన్‌తో బాటు, ఆర్మీలో చేరి, అమోల్ కాలియా అంతటి సమరవీరుడు కావాలని యువకులు ఉవ్విళ్లూరుతున్నారు. అమోల్ కాలియా స్వర్గం నుంచే తన మిత్రుల్ని ఆశీర్వదిస్తున్నాడు.

*(ఇండియాటుడే పత్రికకు, విలేఖరి – రమేశ్ వినాయక్‌లకు కృతజ్ఞతలు. యువత యీ రచనల ద్వారా స్ఫూర్తి పొందుతారని ఆశిస్తున్నాను – రచయిత)*